ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 28 జూలై , 2026 | పేజీలు :6

## సూర్యాపేట అభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 9వ వార్డు ఎన్‌టిఆర్ కాలనీలో మురికి కాలువపై బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటి నుంచి మంజూరైన రూ.5లక్షల నిధులతో చేపడుతున్న ఈ పనుల ద్వారా స్థానికుల రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌళిక వసతుల కల్పనకు మున్సిపాలిటి ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే 9వ వార్డు నుంచి కొన్ని సమస్యలు వచ్చాయని వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, స్థానిక కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న, కాంగ్రెస్ నాయకులు బంటు చొక్కయ్య, మన్నెం మల్లేష్, కోడి శివ, జానయ్య, వీరమల్ల రవిచరణ్, శ్రవణ్ పాల్గొన్నారు.

# ఓటు హక్కు విలువైంది

### అర్హులైన ప్రతీ ఓటరూ ఓటు హక్కును కాపాడుకోవాలి

### ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ;** అర్హులైన ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును కాపాడుకోవాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండ మండలం, ఉమ్మడి ముదిగొండ(ఎంఎల్‌ఏ సొంత గ్రామం) కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, బిఎల్‌వోలు, బిఎల్‌ఏలతో నిర్వహించిన ఎస్‌ఐఆర్ ప్రక్రియపై అవగాహన సమావేశంలో ఎంఎల్‌ఏ బాలునాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును తప్పకుండా కాపాడుకోవాలని అన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలను పారదర్శకంగా, కచ్చితంగా రూపొందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలిచి సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మారుపాకుల సురేష్‌గౌడ్, నాయకులు రుక్మారెడ్డి, జీవన్‌రెడ్డి, ముఖ్య నాయకులు, బిఎల్‌వోలు, బిఎల్‌ఏలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**సర్ ప్రక్రియపై అవగాహన సమావేశం**

**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం సర్ ప్రక్రియపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ పాల్గొని మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన ఓటు హక్కును కల్పించిందని, ఆ హక్కును కాపాడుకోవడం ద్వారా మాత్రమే ప్రజాస్వామ్యం సజీవంగా ఉంటుందన్నారు. ఒక ఓటు ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలదని, ప్రభుత్వాలను మార్చగలదని, ప్రజల భవిష్యతును నిర్ణయించగలదని పేర్కొన్నారు.

**ప్రజాస్వామ్యానికి ఓటే ఒక ఆయుధం**

**ప్రజాపక్షం/చందంపేట;** ప్రజాస్వామయ వ్యవస్థకు ఓటే ఒక ఆయుదం అని , ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం చందంపేట మండల రైతు వేదికలో నిర్వహించిన ఎస్‌ఐఆర్ ప్రక్రియ అవగాహన సమావేశంలో ఆయన అన్నారు. ఓటు హక్కును కాపాడుకోవడం కేవలం వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాకుండా దేశ ప్రజాస్వామ్యాన్ని రక్షించే జాతీయ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు బద్యనాయక్, వెంకటయ్య, గోవింద్, సాధిక్, రాజు, సాయి, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 98 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, జిల్లా పరిషత్ సిఈఓ శిరీష, డిఆర్‌డిఏ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, సిపిఓ కిషన్, డిఇఓ అశోక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమగ్ర వికాసానికి విహార యాత్రలు

విద్యార్థుల సమగ్ర వికాసానికి, మానసిక ఉల్లాసానికి విహార యాత్రలు ఎంతో దోహదపడుతాయని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో నిధులను వినియోగిస్తూ కలెక్టర్ ఆదేశాలతో హైదరాబాద్‌కు బాల భవన్ విద్యార్థినుల కోసం విహారయాత్ర ఏర్పాటు చేశారు. ఈ విహార యాత్రకు బయలుదేరుతున్న విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా నూతన వస్త్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా విద్యార్థులు చారిత్రక, సాంస్కృతిక, విజ్ఞాన సంబంధిత ప్రాంతాలను సందర్శించి కొత్త విషయాలను నేర్చుకోవాలని ఆకాంక్షించారు. ఆడపిల్లల చదువు, వారి సాధికారతే లక్ష్యంగా బేటి బచావో బేటీ పడావో కార్యక్రమం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె. నరసింహారావు, ఏసిడిపిఓ కిరణ్మయి, డిసిపిఓ రవి కుమార్, మహిళా సాధికారత కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, సిబ్బంది, బాలభవన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## మాధవరెడ్డి చౌరస్తాలో మరో వైన్స్ నడిపితే ప్రజాపోరాటం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మాధవరెడ్డి చౌరస్తాలో ఇప్పటికే నడుపుతున్న వైన్స్ వల్ల ప్రజలకు, రాకపోకలకు ఇబ్బందితో రాత్రిపూట గొడవలు ప్రమాదాలు జరుగుతున్నందున మరో వైన్స్ కు ఇక్కడ నడిపితే ప్రజా పోరాటం చేస్తామని కాలనీ వాసులు సంతకాలు చేసి హెచ్చరిస్తూ ఆదివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. హైదరాబాద్ ప్రధాన రోడ్డు ఫంక్షన్ హాల్ షట్టర్‌లో నడుపుతున్న ఎస్‌ఎస్‌ఆర్ వైన్ షాప్‌ను మాధవరెడ్డి చౌరస్తాలోకి తరలించేందుకు ప్రజా ప్రతినిధుల అండదండలతో ప్రయత్నాలు జరుగుతున్నట్లు గమనించి స్థానిక కాలనీవాసులు తీవ్ర అగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నడుపుతున్న వైన్స్ తో ఇరుగుపొరుగు వారు మద్యం బాబులు మత్తులో వీరంగం సృష్టిస్తూ రాత్రిపూట తలుపులు తడుతూ ఇళ్ల వద్ద మూత్ర విసర్జన చేస్తున్నారని ఇల్లు ముందు నిద్రిస్తున్నారని ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయాందోళనలతో వారు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. మత్తులో తూగుతూ వాహనాలను అతివేగంతో నడుపుతూ రోడ్డు దాటుతున్న వారిని ప్రమాదాలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



వినతి పత్రం

తేది: 22/07/2026

## సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత

### ఎమ్మెల్సీ శంకర్ నాయక్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బంజారా సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్సీ, టీపీసీసీ ఆదివాసీ చైర్మన్ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. మిర్యాలగూడ మండలం దుబ్బతండా గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం నిర్వహించిన తీజ్ పండుగ సంప్రదాయ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, బంజారా మహిళలు సంప్రదాయ వేషధారణతో ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానికులతో కలిసి ఆయన సంబరాల్లో పాల్గొని ఆనందోత్సాహాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఆచార వ్యవహారాలు, విశిష్ట సంస్కృతిని కాపాడుకుంటూ రాబోయే తరాలకు అందించేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దుబ్బతండా గ్రామ సర్పంచ్ మాలోతు ఇందిర గిరిబాబు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బంజారా సంఘాల ప్రతినిధులు, గ్రామ మహిళలు, యువకులు పాల్గొన్నారు.





## ప్రజలకు త్వరితగతిన న్యాయం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా చూడాలని జిల్లా ఎస్పి కె. నరసింహ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. అధికారులు స్టేషన్‌కు వచ్చిన బాధితుల సమస్యలను విని వారికి సత్వర న్యాయం చేయడం ద్వారా పోలీస్ శాఖపై వారికి మరింత నమ్మకం కలిగేలా పనిచేయాలన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట మండల కేంద్రానికి చెందిన ఏవిఎం హై స్కూల్ 1999 /2000 బ్యాచ్‌కి చెందిన పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు అందరు కలిసి సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనాన్ని అమృతవనంలో నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైస్కూల్ కరస్పాండెంట్ స్వర్గీయ నాగేందర్ సతీమణి వీరమణి హాజరు అయినారు. ఈ సందర్భంగా స్నేహితులందరూ తమ చిన్ననాటి జ్ఞాపకాలను, తమకు విద్యాబుద్ధులు నేర్పిన టీచర్స్‌ని జ్ఞాపకం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాల మల్లేష్, లవణం రవి, మోటే నరసింహ, కాడే రాజేందర్, ఆకవరపు భాను, ఈతపుల ఉదయ్, లగ్గొని మహేష్, శ్రావణి, స్వప్న, సరస్వతి, విజయలక్ష్మి, బండ లింగస్వామి పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు సిద్ధం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి సాగుపై ఆధారపడకుండా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. సోమవారం మిర్యాలగూడ రైతు వేదికలో విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కంది, పెసర, మినుము, ఉలవలు, అలసంద, కూరగాయల విత్తనాలతో పాటు వివిధ పప్పుధాన్యాల విత్తనాలను ప్రదర్శించి విక్రయానికి అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం. ఋష్యేంద్రమణి, వ్యవసాయ విస్తరణ అధికారులు అఫ్రిన్, రమేష్, నాగయ్య, పార్వతి, విత్తనాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సీహెచ్. కృష్ణవేణి, ఎం.డి. జానీ మియా, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## బుల్లెట్ ట్రైన్ సాధించే వరకు ప్రజా ఉద్యమాలు



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేంత వరకు అలుపెరుగని ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంజనాపురి కాలనీ దగ్గర జాతీయ రహదారి 65 పై అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రం జాతీయ రహదారిపై ఉన్న ప్రధాన వాణిజ్య పట్టణని, తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణించే ప్రజలకు కీలక రవాణా కేంద్రంగా నిలిచిందన్నారు. గత 20 సంవత్సరాలుగా రైల్వే మార్గం కోసం పోరాటాలు కొనసాగుతున్నాయని అన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ రాకుంటే సూర్యాపేట జిల్లా అంధకారంలోకి నెట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోగా పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పెద్దిరెడ్డి రాజా, తండు శ్రీనివాస్ యాదవ్, ఊర రామ్మూర్తి యాదవ్, చల్లమల్ల నరసింహ, మల్లు నాగార్జున్ రెడ్డి, కుంట్ల ధర్మార్జున్, బూర వెంకటేశ్వర్లు, కొత్తపల్లి శివకుమార్, గంట నాగయ్య, షేక్ నజీర్, సతీష్, వల్లోజు ప్రశాంత్ పాల్గొన్నారు.

## వీధి దీపాలు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని వినతి



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : మున్సిపాలిటీలోని మాధవరెడ్డి చౌరస్తా వద్ద వీధి దీపాలూ స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం కమిషనర్ డి.అంజన్ రెడ్డికి కాలనీ వాసులు వినతి పత్రాన్ని అందజేశారు. మాధవరెడ్డి చౌరస్తా కాలనీ మెయిన్ చౌరస్తాలో వీధి దీపాలు సరిగా లేకపోవడం వల్ల రాత్రి సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చీకటి కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ముఖ్యంగా చౌరస్తాకు దగ్గరలో వైన్స్ దుకాణం ఉండటం వల్ల ప్రతి ఎక్కువగా ఉన్నదని మహిళలు, వృద్ధులు పిల్లలు రాత్రివేలలో రోడ్ దాటుతుండగా భయపడుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్లపై వాహనాలు అధిక వేగంతో ప్రయాణించడం వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయనీ పాఠశాలలకు వెళ్లే చిన్నపిల్లలకు ఇబ్బందిగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంసిపియూత్ అసోసియేషన్ అప్పం హరీష్, వంగూరి నరేష్, ఇంజమూరి సాయినాథ్, మొగలోజు భాను చారి, ఆరే అరుణ్,వినతి పత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

## పేద ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి




ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలను బలోపేతం చేసి పేద ప్రజలందరికి నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం జిల్లా కమిటి ఆధ్వర్యంలో పేదలందరికి ఉచిత విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి విద్య, వైద్యం వంటి ప్రాథమిక హక్కులను కల్పించాలని నిర్ధేశించినప్పటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయకుండా ప్రైవేటీకరణను ప్రోత్సహించడం వల్ల పేదలు, మధ్య తరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్నారు. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటి ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా జనరల్ ఆసుపత్రిలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. అనంతరం కలెక్టర్ ఏఓకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, మట్టిపల్లి సైదులు, వెల్పుల వెంకన్న, నరసింహారావు, ధనియాకుల శ్రీకాంత్, బెల్లంకొండ సత్యానారాయణ పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రైతాంగానికి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మిర్యాలగూడ మండలం అన్నారం గ్రామంలో పొలాల్లో నాట్లు వేస్తున్న రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో రైతులతో మాట్లాడుతూ నవంబర్ నెలలో మొదటిసారిగా నల్గొండ కేంద్రంలో జాతీయ రైతు మహాసభలు జరగనున్నాయని, వీటి విజయవంతానికి రైతాంగం ఆర్థికంగా, ఆర్థికంగా సహాయం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడే రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఎన్నికల వేళ రైతును రాజు చేస్తామని, రుణమాఫీ చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక వాగ్దానాలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. రైతులందరూ సహకరించి మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మంగారెడ్డి, రవి నాయక్, అప్పారావు, కాంతారెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కోటిరెడ్డి, బెనర్జీ, కన్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## జల సిరితో భూగర్భ జలాలు పెంచాలి

ప్రజాపక్షం/మోతె : జల సిరి పథకంతో భూగర్భ జలాలను సంవృద్ధిగా పెంచాలని జడ్పి సిఇఓ శిరీష అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీశక్తిభవన్‌లో గ్రామ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలు వేసి నష్టపోకుండా ప్రతి ఒక్క రైతుకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయంతోపాటు ప్రతి ఒక్క రైతు పాడి పశువులు, కోళ్ల పెంపకం, చేపల పెంపకం, ఆయిల్ ఫామ్స్, నిమ్మ, బత్తాయి, కంది, కొర్ర, జొన్న, సజ్జ వంటి ఆరుతడి పంటలకు మొగ్గు చూపే విధంగా కృషి చేయాలని సర్పంచులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ అధికారి శ్యామ్ సుందర్ రెడ్డి, ఏడిఏ ప్రశాంతి, పంచాయితీ రాజ్ డిఇ హర్ష, ఎంపిడిఓ సందీప్ కుమార్, పిఆర్ ఏఇ రంగారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ మౌనిక ఎంపిఓ వంశీకృష్ణ, ఏపిఓ నాగేష్, ఏపిఎం మంజుల, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## వేధింపులను ఉపేక్షించొద్దు




ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : ఎవరైనా ఆకతాయిలు ఆడపిల్లలను, మహిళలను వేధింపులకు గురిచేస్తే ఉపేక్షించవద్దని ఏఎస్ఐ రాములు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో షీ టీమ్స్, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై పోలీస్ కళాబృందంతో విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షీ టీమ్స్, డ్రగ్స్, సైబర్ నేరాలపై పోలీసు శాఖ పటిష్టంగా పనిచేస్తుందన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనంతరం పోలీస్ కళాబృందం వారు చక్కటి సాంస్కృతిక పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఇంచార్జి హెడ్ మా స్టర్ కృష్ణప్రసాద్, షీ టీం హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ రెడ్డి, యాదగిరి, మహిళా హెడ్ కానిస్టేబుల్ కవిత, సునీత, ఉమెన్ ట్రాఫికింగ్ కానిస్టేబుల్ సతీష్, పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మృత్యు దారి..రోడ్డు దాటాలంటే భయం భయం

**క్రాస్ సిగ్నల్ ఏర్పాటు చేయని ఆర్ అండ్ బి అధికారులు**

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఆ దారి దాటాలంటే మృత్యు ఎక్కడ వెంట పడుతుందో అనే ఆందోళన ప్రజల్లో నెలకొన్నది. నిత్యం వేలాది వాహనాలు దాటే అవకాశం ఉన్న కనీసం క్రాసింగ్ సిగ్నల్స్ ప్రమాద జోన్‌గా రోడ్ల భవనాల శాఖ వారు గుర్తించకపోవడం వారిని నిర్లక్ష్యానికి అర్థం పడుతుంది. ఇప్పటికే అనేకమంది రోడ్డు దాటుతూ ప్రాణాలు కోల్పోగా ఆదివారం ఒక యువకుడు ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. ఇది మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలోని ఎన్‌ఎస్పి కాలువ దగ్గర జంకుతండా ఇండస్ట్రీకి వెళ్లే క్రాసింగ్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ఇక్కడ జరిగిన ప్రమాదంలో ఏడాది కాలంలోనే సజ్జల వెంకటరెడ్డి, రామావత్ సక్రు, గుడుగుంట్ల ప్రసాద్‌లు మృతి చెందారు. ఈ విషయమై పలుమార్లు ప్రజా ప్రతినిధులు రోడ్డు భవనాల శాఖ అధికారులకు విన్నవించిన ప్రమాద సిగ్నల్స్,రోడ్డు దాటే క్రాసింగ్ ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





## ప్రభుత్వ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/కోదాడ:** రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు గుండెపంగు రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కోదాడ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటి కాలయాపన చేయకండా తన నివేదికను వెంటనే సమర్పించాలన్నారు. అర్హులైన ఉద్యమకారుల పిల్లలకు ఉపకార వేతనాలు అందించాలని, అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో తోటపల్లి నాగరాజు, పొలంపల్లి వెంకటేశ్వర్లు, సైదులు, రామకృష్ణ పాల్గొన్నారు.

## ఇన్‌స్ట్రక్టర్ ఆయాలకు నియామక పత్రాలు అందజేత



**ప్రజాపక్షం/పాలకవీడు:** మండలానికి చెందిన 2026 27 విద్యా సంవత్సరానికి గానూ మండలంలోని మూడు ప్రైమరీ పాఠశాలలో ప్రీ ప్రైమరి తరగతులకు ప్రారంభించడం జరిగింది. అందులో భాగంగా ఎంపివో ఎస్ పాలకవీడు, ఎంపిపి ఎస్ జాన్‌పహడ్, ఎంపిపి ఎస్ శున్యంపహడ్ పాఠశాలలకు ఒక్కొక్క ఇన్‌స్ట్రక్టర్ ఆయా పోస్టులను మంజూరు చేయడం జరిగింది. జాన్‌పహడ్ ఎంపిపిఎస్ పాఠశాలలో ఎంపికైన చలవాది అరుణ, ఆయా కోడబోయిన భవాని లు గ్రామ సర్పంచ్ కేలావత్ కవిత, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎస్‌వి సుబ్బారావు, మాజీ ఎంపిపి మోతిలాల్ నాయక్, మహిళ కాంగ్రెస్ జ్యోతి, ఎస్‌కె బాలసైదా, శ్రీకాంత్, శేషు, ఉపాధ్యాయులు, గ్రామ కార్యకర్తలు, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలతో రైతులకు మేలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ఆరుతడి పంటలతో రైతులందరికి మేలు చేకూరుతుందని మండల వ్యవసాయ అధికారి ఎర్రంశెట్టి జానకిరాములు అన్నారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు మేళాను సోమవారం స్థానిక రైతు వేదికలో ఆయన ప్రారంభించారు. ఆరుతడి పంటలయిన కంది, పెసర, మినుములు, జొన్నలు, సజ్జలు, కూరగాయల విత్తనాలను రైతులకు పంపిణి చేయడం జరిగింది. ఎల్‌నినో ప్రభావం వలన వర్షాలు లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం వలన రైతులందరు ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆరుతడి పంటలను పండించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు మల్లేష్, మాధురి, తులసి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి ముసుగులో అధికార దుర్వినియోగం



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి ముసుగులో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దంపతులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కమిషన్ల పేరిట కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇందులో భగంగానే కోదాడ పట్టణంలో అండర్ డ్రైనేజీ పనులలో కమిషన్ల కోసం ఎల్‌ఎస్ ఆర్ పేరుతో బ్లాక్ లిస్ట్‌లో ఉన్న ఓ కాంట్రాక్టర్ కట్టబెట్టిన విషయాన్ని ఆయన ఆధారాలతో స్పష్టం చేశారు. ఆయనపై ఇప్పటికే కోర్టులో కేసులు ఉన్నాయని, డ్రైనేజీ పనులను ఆయనకు కట్టబెట్టడంలో అంతర్యం ఏమిటో జిల్లా కలెక్టర్ , సంబంధిత అధికారులు నిగ్గు తేల్చాలన్నారు. వాస్తవ టెండర్‌లో 182 కోట్లు కోడ్ చేస్తే ప్రకటనల్లో మాత్రం 258 కోట్లుగా ఉండటంతో ఆశ్చర్యంగా ఉందని, తేడాగా ఉన్న 72 కోట్లు మతలబెంటో ప్రభుత్వం నిగ్గు తేల్చాలని బ్లాక్ లిస్టులో ఉన్న కాంట్రాక్టర్‌కు టెండర్ ఇవ్వడం వెనుక అంతర్యం ఏమిటో స్పష్టం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాధవరం రిజర్వాయర్ పరిస్థితి కూడా అదేనని, ఇందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బాధ్యుడు కాదా అని ప్రశ్నించారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షులు ఎస్‌కె నయీం, పైడిమర్రి సత్యబాబు, పట్టణ నాయకులు కుక్కడపు బాబు, ఉపేందర్‌గౌడ్, కరీముల్లా, గొర్రె రాజేష్, చలి వెంకట్, సంగిశెట్టి గోపాల్, ఉపేందర్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదిక



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆర్డీవో ఎస్.రమణారెడ్డి కోరారు. సోమవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఏ శాఖకు చెందిన సమస్య అయినా ప్రజావాణి ద్వారా తీసుకురావచ్చని, వచ్చిన ప్రతి వినతిని సంబంధిత అధికారులకు పంపి త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సోమవారం నాటి ప్రజావాణికి మొత్తం 12 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో సబ్ కలెక్టర్ కార్యాలయానికి సంబంధించి 3, త్రిపురారం తహసిల్దార్ కార్యాలయానికి 2 ఫిర్యాదులు ఉన్నాయి. పెద్దవూర, మాడుగులపల్లి, నిడమనూరు, వేములపల్లి, దామరచర్ల తహసిల్దార్ కార్యాలయాలకు ఒక్కొక్కటి చొప్పున, మిర్యాలగూడ మున్సిపాలిటీకి ఒకటి, మిర్యాలగూడ ఆర్ అండ్ బి డిఈఈ కార్యాలయానికి ఒకటి ఫిర్యాదు అందినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే గుర్తింపు కార్డులు ఇవ్వాలి



**ప్రజాపక్షం/రామన్నపేట** : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన నిజమైన ఉద్యమకారులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గుర్తింపు కార్డులు జారీ చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధమల్ల బాలయ్య డిమాండ్ చేశారు. రామన్నపేట మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీని స్వాగతిస్తున్నప్పటికీ,కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల వారీగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిజమైన ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. ఉద్యమకారుల న్యాయమైన హక్కులను అమలు చేయాలని, ప్రతి ఉద్యమకారునికి 250 చదరపు గజాల ఇంటి స్థలం, రూ.25 వేల నెలవారీ పింఛన్, హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సాంస్కృతిక విభాగం కళాకారుల సంఘం జిల్లా కన్వీనర్ గంధమల్ల వెంకటేశం, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకుడు రెబ్బాసు రాములు, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం యాదగిరి, సీపీఐ మండల మాజీ కార్యదర్శి గంగాపురం యాదయ్య,స్థానికం చీఫ్‌ఎడిటర్ డాక్టర్ కొండ మల్లేశం గౌడ్ , మండల అధ్యక్షుడు నోముల శంకర్,ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి లింగయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండి ఇమామ్, మద్దెగల్ల నరసింహ,కైరంకొండ సంతోష్,ఎర్ర రమేష్ గౌడ్,పెండం రవీందర్,వెంకటేశం పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




**ప్రజాపక్షం/చిట్యాలః** అమ్మాయిలు చిన్నతనం నుండే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నల్లగొండ షీటీం ఎస్‌ఐ ఎండి గౌస్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక మండల విద్యాధికారి పి సైదానాయక్ నేతృత్వంలో సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రతకు షీ టీంలు ఎల్లవేళలా అండగా నిలుస్తాయన్నారు. బాలికల, మహిళల పట్ల ఎవరైనా అమర్యాదగా వ్యవహరించినా, ఈవ్ టీజింగ్ చేసినా, అసభ్యకర రీతిలో ప్రవర్తించినా వారు నేరం చేసిన వారౌతరని అన్నారు. ఎవరైన ఇబ్బందులకు గురిచేస్తే నేరుగా షీ టీంను సంప్రదించవచ్చని, దానికంటే ముందు తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియపర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఎస్‌ఐ వెంకటయ్య, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



## కలాం సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/కోదాడ:** భారతదేశ శాస్త్ర సాంకేతిక రంగాలకు విశిష్ట సేవలు అందించి దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహోనీయుడు డాక్టర్ ఎ పిజె అబ్దుల్ కలాం అని జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. సోమవారం మాజీ రాష్ట్రపతి కలాం వర్ధంతి సందర్భంగా కోదాడ పట్టణ గాంధీ పార్కులో ఉన్న కలాం విగ్రహనికి స్వర్ణ భారతి ట్రస్టు సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చీఫ్ అడ్వైజర్ పైడిమర్రి సత్యబాబు, గరిణే శ్రీధర్, రాయపూడి వెంకటనారాయణ, వెంపటి వెంకటరమణ, దేవరశెట్టి శంకర్‌రావు, చిట్టిపోలు నారాయణ, గునుగుంట్ల సాయి, వెంపటి ప్రసాద్, కిట్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## బోర్డులకు మాత్రమే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు




**ప్రజాపక్షం/అనంతగిరి:** గత ప్రభుత్వం క్రీలను ప్రోత్సహించాలని క్రీడా ప్రాంగణాలు ఎంపిక చేయాలని అధికార యంత్రాంగానే ఆదేశించింది. దీంతో గ్రామాలలో సరిఫడా స్థలాలు లేని ప్రాంతాల్లో సైతం బోర్డులు ఏర్పాటు చేశారు. క్రీడా వస్తువులు సైతం క్రీడాకారులకు ఇవ్వలేదు. కొన్ని చోట్ల ఉన్న బోర్డులను తొలగించారు. వాయిలసింగారం నర్సరీ ఆవరణలో క్రీడా స్థలం ఉన్నట్లు సృష్టించి బోర్డు పెట్టి వదిలేశారు. గోల్‌తండా క్రీడా స్థలాన్ని మీడియా తండా వద్ద కోదాడ వెళ్లు మార్గంలో గుట్టలలో కిలో మీటర్ల దూరంలో బోర్డు పెట్టి వదిలేయడం అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనం. గ్రామాలలో యువత క్రీడల వైపు తీసుకెళ్లాలని, తాగుడుకు బానిసై మత్తు పదార్థాలు, గంజాయి, పేకాట, సిగిరెట్లు త్రాగుతూ చెడు మార్గంలో ప్రయాణిస్తున్నారని ఇకనైనా ప్రజాప్రతినిధులు అధికారులు విద్యార్థులు కావాల్సినటువంటి క్రీడా స్థలాలు క్రీడల పరికరాలు ఏర్పాటు చేయాలని గ్రామాల్లో ఉన్నటువంటి యువతను క్రీడపై మక్కువ చూపే విధంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే మందుల సామెల్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** కోమటిరెడ్డి బ్రదర్స్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య డిమాండ్ చేశారు. చౌటుప్పల్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ పేద ప్రజలకు తన సొంత డబ్బుతో సేవ చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని అన్నారు. ఎమ్మెల్యే మందుల సామెల్ ఇష్టానుసారంగా మాట్లాడుతూ కోమటిరెడ్డి బ్రదర్స్ పై పిచ్చి ప్రేలాపన పేలడం మానుకోవాలని హితువు పలికారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ చైర్పర్సన్ మోగుదాల పావని రమేష్, వైస్ చైర్మన్ గోశిక వినయ్, కౌన్సిలర్లు మహేశ్వరి, మధుసూదన్, పాక చిరంజీవి, కోసనం రాకేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్యపాల్గొన్నారు.





## ఘనంగా గంగమ్మజాతర

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గ్రామంలో యాదవ్‌ల ఆరాధ్యదైవమైన గంగమ్మ పండుగను సోమవారం యాదవ్ కులస్తులు అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా గరిడేపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ బోనమెత్తి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.మహిళలు వందలాదిమందిగా బోనాలు నెత్తినపెట్టుకుని అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదవ్‌లు అమ్మవారికి జంతు బలిఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగమ్మగుడి చైర్మన్ చింతకాయల వెంకటేశ్వర్లు, సారెగోళ్ల రేఖ, వెంకట నర్సు, సర్పంచ్ బొల్లేపల్లి రామనాథం, చింతకాయల సైదులు, సంకబుడ్డి నర్సయ్య పాల్గొన్నారు.

## చర్చల్లో అంగీకరించిన అంశాలను అమలు చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆర్‌టిసి సమ్మె సందర్భంగా ఈడి అధికారులతో జరిగిన చర్చల్లో అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రిజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్ అన్నారు. సోమవారం ఇచ్చిన హామీలను వెంటనే అమలు పర్చే విధంగా యాజమాన్యం చొరవ చూపాలని కోరుతూ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈడిల కమిటి కార్మిక సంఘాలతో జరిగిన చర్చలు రెండు నెలలు పైబడుతున్న నేటి వరకు అమలు చేయలేక పోవడం చాలా దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో రవి, లక్ష్మయ్య, వెల్పుల వెంకన్న, కె. నాగరాజు, జివెల్ రావు, ఇంద్ర సైదులు, నరేష్, కొమరయ్య, సంధ్య, బేగం పాల్గొన్నారు.

## నేడు విబి జిరామ్‌జీ జలసిరి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** విబిజి రామ్‌జీ జలసిరి పనులు, ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల ప్రత్యామ్నాయ పంటలు సాగు, ఇతర శాఖల అభివృద్ధి పనులపై నేడు నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయంలో మొదటి సమీక్ష సమావేశం ఉదయం 11 గంటలకు మండల ప్రత్యేక అధికారి వి.మోహన్‌బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడివో సోమసుందర్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు ఈ సమావేశానికి తప్పకుండా హాజరు కావాలన్నారు.

## మృతదేహానికి నివాళులు

ప్రజాపక్షం/రామన్నపేట : మండల పరిధిలోని ఇంద్రపాలనగరానికి గ్రామంలో అకాల మరణం చెందిన నల్ల పాపయ్య మృతుదేహానికి గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, మాజీ ఏఎంసి డైరెక్టర్ మందడి విద్యాసాగర్ రెడ్డి, యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్, రాస వెంకటేష్, చేనేత సహకారసంఘము చైర్మన్ రవ్వ నర్సింహా, మాజీ ఉపసర్పంచ్ సింగణబోయిన జంగయ్య యాదవ్,నక్క వెంకటేష్ పాల్గొన్నారు.

## 'నాంపల్లి'లో 55,671 ఎకరాల్లో ఖరీఫ్ సాగు

**ప్రజాపక్షం/నాంపల్లి:** వానాకాలం (ఖరీఫ్) 2025 /26 సీజన్‌కు సంబంధించిన తుది సాగు విస్తీర్ణ నివేదికను మండల వ్యవసాయ అధికారి బండారు శివ వెల్లడించారు.నివేదిక ప్రకారం నాంపల్లి మండలంలో మొత్తం 55,671 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయబడ్డాయి. ఇందులో 5,411 ఎకరాలు నీటిపారుదల కింద, 50,260 ఎకరాలు వర్షాధారంగా సాగు అయ్యాయి.మండలంలో పత్తి ప్రధాన పంటగా 49,789 ఎకరాల్లో సాగు చేయబడింది.అనంతరం వరి 3,423 ఎకరాలు,కూరగాయలు 1,507 ఎకరాలు, జొన్న 825 ఎకరాలు, సజ్జలు 491 ఎకరాలు, ఆయిల్ పామ్ 357 ఎకరాలు,చందనం 209 ఎకరాలు, కందులు 143 ఎకరాలు,పెసలు 99 ఎకరాలు, మిరప 84 ఎకరాలు, యూకలిప్టస్ 78 ఎకరాలు, బొప్పాయి



46 ఎకరాలు, జామ 16 ఎకరాలు,మెలియా డుబియా 13 ఎకరాలు, సీతాఫలం 13 ఎకరాలు,కస్టర్డ్ ఆపిల్ 12 ఎకరాలు, సాగు నమోదైంది.10 ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణంలో అలసందలు,ఉసిరి,దానిమ్మ, కొబ్బరి, జామున్, బీరకాయ, టమాటా, వంకాయ, చిక్కుడు, సొరకాయ,బీన్స్,జీడిమామిడి,మహోగని తదితర పంటలు సాగు చేయబడ్డాయని వ్యవసాయ అధికారి తెలిపారు.

## ఉపాధిహామీ పనులను ప్రజలు సద్వినియోగం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్యగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో 2025/26 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులకు 65 లక్షల రూపాయల పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్ గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని విబిజిరాంజీగా ఈ పథకం ద్వారా నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, ఫారంపాండ్స్, నీటి నిల్వ పనులకు అవకాశం కల్పిస్తుందని అన్నారు. ప్రజలు ఈ పనులను నిర్వహించుకోవచ్చన్నారు. అవసరమైన వారు గ్రామ పంచాయతీలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. గ్రామంలో వస్తున్న ఫించన్ల పై కూడా ఆడిట్ నిర్వహించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు కూడా ఉపాధి హామీ పథకం ద్వారానే ప్రభుత్వం 39వేల



రూపాయలు అందిస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో పదిరోజుల పాటు నిర్వహించిన అడిట్ పై ఆడిటర్లు తాము సేకరించిన సమాచారాన్ని గ్రామ సభకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పి సురేష్, ఉప సర్పంచ్ మాతంగి సంజీవ, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, టిఏ శిరిష, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత పాల్గొన్నారు.

## ప్రతి నీటి బొట్టును సంరక్షించడమే భావితరాలకు భద్రత



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ప్రతి నీటి బొట్టును సంరక్షించడమే భావితరాలకు భద్రత అని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి అన్నారు. జాతీయ జల మిషన్, స్వచ్ఛ సర్వేక్షణ్ 2025/26 కార్యక్రమాల్లో భాగంగా సూర్యాపేట మున్సిపాలిటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాచ్ ది రైన్ వేర్ ఇట్ ఫాల్స్, వెన్ ఇట్ ఫాల్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం రాయినిగూడెం గ్రామ పరిధిలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో వ్యాసరచన, పోస్టర్ ప్రదర్శన, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నీటి సంరక్షణ అవసరాన్ని వివరించారు. వర్షపు నీటిని సేకరించి భూగర్భ జలాలను పెంపొందించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి భద్రతను కల్పించవచ్చన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేసి సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆడెపు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నీలమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి. నవీన్ కుమార్, చీఫ్ ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శివ ప్రసాద్, వార్డు అధికారి నరేష్, అధ్యాపకులు, మున్సిపల్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖాతాదారుల సహకారంతో సుధా బ్యాంక్ పురోభివృద్ధి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** వాటాదారుల, ఖాతాదారుల సహకారంతో పురోభివృద్ధిలో సుధా బ్యాంక్ పయనిస్తుందని బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ చెప్పారు. సోమవారం జిల్లా కేంద్రంలోని త్రివేణి ఫంక్షన్ హాల్‌లో జరిగిన 27వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. సహకార రంగంలో 27 సంవత్సరాలుగా అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ క్రమం తప్పకుండా వాటాదారులకు డివిడెంట్ పంపిణీ చేస్తూ పురోభివృద్ధిలో బ్యాంక్ పయనిస్తుందని చెప్పారు. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ ఏజెండా తీర్మానాలను చదివి వినిపించి వాటాదారుల ఆమోదం పొందారు. రాబోయే సంవత్సర కాలానికి బ్యాంకు సొంత భవనం ఏర్పాటు చేయాలని తీర్మానానికి వాటాదారులందరూ ఆమోదించారు. 9 బ్రాంచిలతో బ్యాంక్ పటిష్టంగా ఉందని రాబోయే కాలంలో మరిన్ని శాఖలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మొదట చైర్మన్ నివేదికను వైస్ చైర్మన్ కక్కిరేణి శేఖర్ చదివి వినిపించారు. బ్యాంకు పనితీరును సమీక్షిస్తూ పురప్రముఖులు, వాటాదారులు గండూరి శంకర్, పెద్దిరెడ్డి రాజా, ఇరిగి కోటేశ్వరి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు ఏపూరి శ్రవణ్ కుమార్, మీలా సందీప్, తోట శ్యాంప్రసాద్, డాక్టర్ విజయలక్ష్మి , అనంతుల శారద, బానోతు సుజాత, పటేల్ నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శుల నియామకం

**ప్రజాపక్షం/రామన్నపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఆదేశానుసారం తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి, నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షులు ఏనుగు రఘుమా రెడ్డి సహకారంతో రామన్నపేట మండల యువజన కాంగ్రెస్ 24 గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులను మరియు కార్యవర్గ సభ్యులను నియమించినట్లు రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టె సంతోష్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా బట్టె సంతోష్ కుమార్ మాట్లాడుతూ నూతన గ్రామ అధ్యక్షులకు మరియు కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. కొత్తగా నియమింపబడ్డ నాయకులకు విజయవంతమైన పదవీకాలం ఉండాలని కోరారు.

## రోస్టర్ విధానంపై అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఎస్‌సి వర్గీకరణ పై రాష్ట్రంలో తీసుకొచ్చి న రోస్టర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని భీమ్ మిషన్ ఐడియాలజీ రాష్ట్ర అధ్యక్షులు.దామల్ల సర్వయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని బిటిఎస్‌లో గ ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ భవనం లో రాజ్యాంగ హక్కు పరిరక్షణ. ఎస్‌సి వర్గీకర ణ రోస్టర్ విధానం పై అవగాహన సదస్సును డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు ఈంస మారయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దామల్ల సర్వయ్య పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో తీసుకొచ్చిన ఎస్‌సివర్గీకరణ పై రోస్టర్ విధానం తో మాలలకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. ఈకార్యక్రమంలో భీమ్ మిషన్ ఐడియాలజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిట్టిబాబు,డాక్టర్ రాజు,బోగరి విజయ్ కుమార్,గోలి సైదులు,డాక్టర్ నామ చిన్న వెంకట రాములు, ఎంఎల్ వెంకట్రావు రావిరాల ఆంజనేయులు,ఈసం మారయ్య, గోలి మల్లేష్,ఉపాధ్యక్షులు గాదరి సుందరయ్యపాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నియంత్రణ ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యం

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** ప్లాస్టిక్ నియంత్రణ ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని పర్యావరణ మార్పును ఎదుర్కోవడంలో విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలని కోఆర్డినేటర్ డా మారం వెంకట రమణారెడ్డి సూచించారు.నల్లగొండ పరిధిలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం చేపట్టి న ప్లాస్టిక్ రహిత క్యాంపస్ లక్ష్యంతో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల,సైన్స్ ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్ లు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ రహిత క్యాంపస్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డా మారం వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణ ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని పర్యావరణ మార్పును ఎదుర్కోవడంలో విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో నేడు దేశం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను వివరిస్తూ పర్యావరణహితమైన జీవితం కార్యాచరణ విశ్వవిద్యాలయాళ నుండి ప్రారంభం కావాలని కోరారు.ఈకార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం వసంత,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నీలకంఠం శేఖర్,డాక్టర్ కిరణ్ మై, రమేష్ నాయక్,శ్రీనివాస్, శ్రీధర్ రావు, సత్తిరెడ్డి,ఇంజనీరింగ్ కళాశాల



## ఆరుతడి పంటల ద్వారా అధిక లాభాలు

**ప్రజాపక్షం/బీబీనగర్ :** వర్షాభావం తక్కువ ఉన్నందున ఆరుతడి పంటలు వేసుకొని రైతులు అధిక లాభాలు పొందాలని సింగల్ విండో చైర్మన్ పోట్టోల్ శ్యామ్ గౌడ్ అన్నారు. సోమవారం రైతు వేదికలో విత్తన మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్యాలయంలో రైతులకు కందులు మొక్కజొన్న వివిధ రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్ ఉప్పలంచి శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి పద్మ, అమూల్య, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

## విత్తన మేళా సీడ్స్ పంపిణీ

**ప్రజాపక్షం/బీబీనగర్ :** బీబీనగర్ మండలం రైతు వేదికలో విత్తన మేళా సీడ్స్ పంపిణీ కార్యక్రమాన్ని పిఏసిఎస్ చైర్మన్ పోట్టోల్ల శ్యామ్ గౌడ్, బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఉప్పలంచి శ్రీకాంత్, మైలారం మహేష్, మండల్ అగ్రికల్చర్ ఆఫీసర్ పద్మ, బీబీనగర్ క్లస్టర్ ఏఈఓ ఉదయ్ కిరణ్, వెంకిర్యాల ఏఈఓ అమూల్య, రాయరావుపేట ఏఈఓ నవిత పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి అండ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రానికి చెందిన కోడపర్తి లక్ష్మయ్య, నాను సుక్కమ్మలు ఇటీవల మరణించడంతో సోమవారం గుండాల గ్రామ ఉప సర్పంచ్ ఆవుల సాయిప్రసాద్ మృతుల కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి 50కేజీల బియ్యాన్ని అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు భాస్కర్, జిల్లా కార్యదర్శి వెంకన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రమోష, లక్ష్మయ్య, రమేష్, శ్రీను, ఐలయ్య, శోభన్‌బాబు, ప్రశాంత్, ఉపేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## యాదవ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా మహేష్‌యాదవ్

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పెద్దపడిశాల గ్రామానికి చెందిన కదారి మహేష్ యాదవ్ యాదవ చైతన్య వేదిక యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం యాదవ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల అయిలేష్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** మండలంలోని ఎల్లాపురం తండాకు చెందిన కొర్ర కార్తీక్ వారణాసి ఐఐటీలో సీటు సాధించారు. సోమవారం ఎల్లాపురం తండాలో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగా రెడ్డి ఆధ్వర్యంలో కార్తీక్ కు ఆర్థిక సహాయం అందజేశారు.ఆర్థిక సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకి చేరుకోవాలని ఆకాక్షించారు.తల్లిదండ్రులకి,గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.ఈకార్యక్రమంలో ఎల్లాపురం సర్పంచ్ రాజు,మాజీ సర్పంచ్ బిచ్చనాయక్,మాజీ ఎంపీటీసీ దేవు నాయక్,ఉప సర్పంచ్‌లు సర్మన్,నగేష్,గ్రామస్థులు శంకర్ నాయక్ పాల్గొన్నారు.



## స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రవళికకు ఘన సత్కారం



**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు సోమవారం చైనాలో జరిగిన ఆసియా అండర్ 23 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 4400 మీటర్ల మహిళల రిలేలో నారీమల్ల ప్రవళిక స్వర్ణం సాధించిన సందర్భంగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌విటి సభ్యులతో కలిసి స్వర్ణ పతకాన్ని మెడలో వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నారిమళ్ల ప్రవళిక నేటి యువతకు స్ఫూర్తి అని చదువును నిర్లక్ష్యం చేయకుండా, క్రీడల్లో రాణించి దేశానికి స్వర్ణపతకాన్ని అందించిందని అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో ఇలాంటి ఎంతో మంది క్రీడాకారులు ఉన్నారని వారికి క్రీడా స్థలాలు లేకపోవడం దురదృష్టకరమని, ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలు అందుబాటులోకి వస్తే ఎంతో మంది క్రీడాకారులు దేశానికి ఆడి నియోజకవర్గానికి గొప్ప పేరును తీసుకువస్తారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కోచ్ పరశురాముని కూడా అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కోశాధికారి కృష్ణకిషోర్, నిరంజన్, కరుణాకర్, శైలేష్, ఆంజనేయులు, సన్నీ, కౌన్సిలర్ మురళి, సాయిచంద్రగౌడ్, గోపి, రాజు, క్రీడాకారులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు కుల జనాభా గుర్తింపుకు రాష్ట్రవ్యాప్త సర్వే



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో మున్నూరుకాపు కులస్థుల జనాభాను గుర్తించేందుకు ఆధార్ నంబర్లతో రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేపట్టనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తమరావు తెలిపారు. మిర్యాలగూడలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలానికి ఐదుగురు ప్రతినిధులను, గ్రామానికి ముగ్గురిని ఎంపిక చేసి సుమారు 5 వేల మందితో సర్వే చేపడతామన్నారు. వీరికి ఒకరోజు శిక్షణ ఇచ్చి నిర్ణీత విధానంలో రాష్ట్ర వ్యాప్త సర్వే చేస్తామన్నారు.పాలక ప్రభుత్వాలు మున్నూరుకాపు జనాభాను తక్కువ చేసి చూపుతున్నాయని విమర్శించారు. 1931లో నిజాం ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 7.93 లక్షల మున్నూరుకాపు జనాభా ఉండగా, 1955లో పెద్దపల్లి సభలో 35 లక్షలవరకు ఉన్నారని గుర్తించారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కులాల వారీగా సర్వేలో కేవలం తక్కువశాతం ఉన్నట్లుగా చూపి వారికి రావాల్సిన రాజకీయ వాటాను తగ్గించారన్నారు. దీన్ని తాము విశ్వసించటం లేదని, అందుకే ఈ సర్వే చేయిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి కంచి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు వాసుదేవుల వెంకటనర్సయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులు, కళాకారులకు న్యాయం చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మిర్యాలగూడ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేసింది. ఉద్యమకారులు, కళాకారుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కేకే కమిటీ నివేదికను జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి, ఆ నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టాలని కోరింది.సోమవారం మిర్యాలగూడ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం నాయకులు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం కోట్లాది ప్రజల ఆకాంక్షల ఫలితమని, ఆ ఉద్యమ విజయానికి ఉద్యమకారులు, కళాకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, ప్రజా సంఘాలు అందరూ విశేష కృషి చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఏళ్ల గడిచినా, ఉద్యమకారులు, కళాకారులు ఆశించిన గుర్తింపు, గౌరవం, అవకాశాలు పూర్తిస్థాయిలో అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాలోతు దశరథ నాయక్, నకిరేకంటి కిరణ్ కుమార్, బంటు వెంకటేశ్వర్లు, ఎస్.కె. ఇక్బాల్, గంధం సైదులు, జంగం శ్రీనివాస్, ఎం.డి. మహమూద్, ఎర్రబెల్లి దుర్గయ్య, గొప్పని నగేష్, తాళ్లపల్లి నరసయ్య, సామ కోటయ్య, దాసరాజు జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం వర్ధంతి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణంలోని సోమవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షులు షేక్ యూసఫ్ అధ్యక్షతన భారతరత్న, మాజీ రాష్ట్రపతి, మిస్సైల్‌మాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు ఆర్. అంజయ్య, ఉపాధ్యక్షులు గుండా సత్యనారాయణ, మాలగుండ్ల వెంకటరెడ్డి, సభ్యులు రూపావత్ బాలు, మహేంద్ర, కొప్పు లక్ష్మి నారాయణగౌడ్ పాల్గొన్నారు.



## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/తిప్పర్తి:** విద్యార్థులు,యువత మాదకద్రవ్యాలకు,చెడు వ్యసనాలకు బానిసలుగా మారొద్దని తిప్పర్తి ఎస్ఐ ఇరుగు రవి పిలుపునిచ్చారు. పజ్జూరు గ్రామ సెంటర్ లో సర్పంచ్ మాతంగి.హేమలత శోభన్ బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.నేడు సమాజంలో ప్రబలుతున్న పెడధోరణుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహనతో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ ప్రధాన సెంటర్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాతంగి.హేమలత శోభన్ బాబు,ఉపసర్పంచ్ సింగం నాగమ్మ సైదులు,వార్డు మెంబర్లు మురళి, రాగి, దాసరి నాగరాజు,కుపాకుల శ్రీను,సింగం అనిల్,గ్రామ పోలీస్ అధికారి రాంరెడ్డి,పిసినాగ రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.



## స్పీడ్ బ్రేకర్లు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలంలోని వెంకటాద్రిపాలెం వద్ద గల కోదాడ జడ్చర్ల రహదారిపై జంకు తండా ఇండస్ట్రియల్ ఏరియా క్రాసింగ్ వద్ద ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మేరాత్ విజయ్ నాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్.రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంకు తండా క్రాసింగ్ వద్ద నిత్యం వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కాలంలోనే ఈ ప్రాంతంలో ముగ్గురు మృతి చెందారని, అనేకమంది గాయపడ్డారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బాధ్యులు, స్థానిక ప్రజలు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ప్రవాసి యోజన కార్యక్రమం



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామంలో సోమవారం బిజెపి ప్రవాసి యోజన కార్యక్రమాన్ని బూత్ నెంబర్ 238, 239లో నిర్వహించారు. బూత్ కమిటీలను పునర్వ్యవస్థీకరించి నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈసందర్భంగ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ అనంతారం గ్రామానికి వచ్చే ప్రతి రూపాయి అభివృద్ధి నిధులు కేంద్ర ప్రభుత్వమే అందిస్తోందని, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పారదర్శకమైన అవినీతి రహిత, ప్రజా సంక్షేమ పరిపాలనను అందిస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. అనంతరం బిఎల్‌వోలు, బిఎల్‌ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా కోశాధికారి మండల ఇంచార్జ్ గుజ్జు సోమనర్సయ్య, మండల అధ్యక్షులు విజయ్‌భాస్కర్ రెడ్డి, మండల జనరల్ సెక్రటరీ శ్రీకాంత్, సీనియర్ నాయకులు రుద్రయ్య, బూత్ అధ్యక్షులు రమేష్‌పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఎల్ నినో ప్రభావం,వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి కొరత ఏర్పడినందున రైతులు వరి సాగును తగ్గించి, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని నకిరేకల్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) తిప్పన విజయేందర్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక నిమ్మ మార్కెట్ ఆవరణలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో నీటి ఎద్దడిని తట్టుకునేలా రైతులకు నాణ్యమైన ప్రత్యామ్నాయ విత్తనాలను అందించేందుకే ప్రభుత్వం ఈ మేళాలను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ జానిమియా, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.కె. హిదాయతుల్లా, ఎ.లింగయ్య,ఎండీ మోహిన్,విత్తన డీలర్లు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## నేడు జలసిరిపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల ఎంపీడీవో కార్యాలయంలో రేపు మంగళవారం విబిజి రాంజీ పథకం మరియు తెలంగాణ జలసిరి కార్యక్రమం పై నేడు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ శర్మ వెల్లడించారు.ఈ కార్యక్రమానికి మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఐకెపి,విబికె,అర్డబ్ల్యుఎస్,పిఆర్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.జలసిరి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు,చెరువుల పునరుద్ధరణ తదితర అంశాలపై చర్చించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

## నేడు జాతీయ మహిళా సమాఖ్య మండల మహాసభ

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జాతీయ మహిళా సమాఖ్య మండల మహాసభ నిర్వహించడం జరుగుతుందని మహిళా సమాఖ్య నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహా సభకు ముఖ్య అతిథిగా జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి బండి జంగమ్మ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. మహిళా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల రైతు వేదికలో 'విత్తన మేళా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని బి పూజ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ ఎల్ ని నో ప్రభావం వల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపాల్సిన అవసరం ఉందని అన్నారు. వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తక్కువ నీటిని వాడుకుంటూ దిగుబడులను ఇచ్చే స్వల్పకాలిక రకాల పంటలను సాగు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ముత్యాల అంజయ్య, కరెంటోత్ లచ్చునాయక్, నారాయణపురం ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, వార్డు సభ్యులు బాలకృష్ణ, పందుల యాదగిరి, వ్యవసాయ విస్తరణ అధికారులు సైదులు అనురాధ పాల్గొన్నారు

## ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని గూడూరు గ్రామంలో గల హైదరాబాద్ యాదగిరి టోల్ ప్లాజాలో హైదరాబాద్ అపెక్స్ హాస్పిటల్ వారి సహకారంతో ఉద్యోగస్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టోల్ ప్లాజా ప్రాజెక్ట్ అధికారి సెంథిల్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తుల ఆరోగ్యమే మహాభాగ్యం అని వారి సంరక్షణ కోసం సమస్త ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలియజేశారు. రాబోవు రోజుల్లో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ శిబిరంలో ఉద్యోగస్తులందరికీ ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్ నాగేశ్వరావు, అకౌంట్స్ మేనేజర్ సతీష్, హెచ్ ఆర్ మేనేజర్ భాస్కర్, అపెక్స్ హాస్పిటల్ వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

## విత్తన మేళాను సద్వినియోగం

**ప్రజాపక్షం/చండూరు:** ఎల్‌నినో ప్రభావం వలన సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయి పోయినందున రైతులు ప్రత్యామ్నాయ పంటల పైపు మొగ్గు చూపాలని చండూరు మండల వ్యవసాయ అధికారి మల్లేశం రైతులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని బంగారిగడ్డ రైతు వేదికలో విత్తనవేళాను నిర్వహించారు. రైతులకు ఆరుతడి సాగు అనుకూలమైన కంది ,పెసర మొదలగు వంటి విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని అన్నారు. ప్రస్తుతం ఆరుతడి సాగుకు అనుకూలమైన కంది విత్తనాలు బంగారిగడ్డ రైతు వేదికలో అందుబాటులో ఉన్నాయని ఈ విత్తన మేళా 27,28,29 తేది వరకు అవకాశం ఉంటుందని దీనిని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మల్లేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జగన్ ,రైతులు పాల్గొన్నారు.

# అమరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** సిపిఐ(ఎంఎల్) జనశక్తి నాయకులు,గోదావరిలోయ ప్రతిఘటన పోరాట యోధులు సరసనపల్లి అమరులు పజ్జూరి కృష్ణారెడ్డి, భరత్,రాజు 26వ వర్ధంతిని పురస్కరించుకుని అమరుల స్మారక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నివాళుల కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పల్లెపహాడ్ గ్రామంలోని సరసనపల్లి అమరవీరుల స్మారక స్థూపం వద్ద జరిగిన కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క అరుణపతాకాన్ని ఎగురవేసి అమరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ పజ్జూరి కృష్ణారెడ్డి దోపిడి,పీడన, అసమానతలు లేని సమాజం కోసం పోరాడారని తెలిపారు. విప్లవోద్యమంలో భాగంగా అక్రమ కేసులు నమోదు కావడంతో పార్టీ నిర్ణయం మేరకు రహస్య జీవితంలోకి వెళ్లి విజయ్ పేరుతో గుండాల దళ కమాండర్‌గా పనిచేశారని గుర్తుచేశారు.నీట్ పరీక్ష లీకేజీ ని నిరసిస్తూ విద్యార్థులు, యువకులు చేసిన పోరాటాల ఫలితంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మకంటి కొమురయ్య అధ్యక్షత వహించగా అమరుల స్మారక కమిటీ, రైతుకూలీ సంఘం నాయకులు ఇప్ప రామకృష్ణ, బంటు రామలింగయ్య, గొండ్యాల సైదులు, పల్లెబోయిన జానీ, బొడ్డు నాగరాజు, బాలస్వామి, గోపి, మామిడి ఎల్లయ్య,బాబు,పజ్జూరి కృష్ణారెడ్డి సతీమణి ఉపేంద్ర, రమేష్, రాకేష్ పాల్గొన్నారు.

# సమాజంలో సాంఘిక అసమానతలు తొలగించేందుకు కృషి చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మత దుహంకారం, కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం నూతన కమిటీల పునర్నిర్మాణంపై నాయకత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌చార్జి కోళ్ల శివ మాదిగ పిలుపునిచ్చారు.ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం కోసం జరిగే పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన అన్నారు.జిల్లా కేంద్రంలోని టీఎన్‌జివో భవన్‌లో ఎంఎస్‌పి, ఎంఆర్‌పిఎస్,అనుబంధ సంఘాల అత్యవసర జిల్లా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి రిజర్వేషన్ల ఫలాలు ఎస్సీలలోని ప్రతి కులానికి జనాభా ప్రాతిపదికన అందేలా చేసిన పోరాటంలో విజయం సాధించామని తెలిపారు. న్యాయమైన పోరాటంలో సంకల్పబలం, నిరంతర శ్రమ, ఐక్యతతో పాటు వివిధ సందర్భాల్లో నిర్వహించిన శక్తి ప్రదర్శనల ఫలితంగానే ఎస్‌సి వర్గీకరణ సాధ్యమైందన్నారు. కేవలం ఎస్‌సివర్గీకరణ సాధనకే పరిమితం కాకుండా సమాజంలోని ప్రతి పేద కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పి, ఎంఆర్‌పిఎస్ నాయకులు జానకి చౌదరి, బకరం శ్రీనివాస్ మాదిగ,ఇరిగి శ్రీశైలం మాదిగ, మేడి శంకర్ మాదిగ,కొమిరె స్వామి మాదిగ,బొజ్జ దేవయ్య మాదిగ,పోలేని యాదయ్య మాదిగ, మడుపు శ్రీనివాస్ మాదిగ, బొజ్జ చిన్న మాదిగ,ఎర్రసాని గోపాల్ మాదిగ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సత్వరమే పరిష్కరించడం ప్రతి శాఖాధికారి బాధ్యత అని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు.సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.అనంతరం జిల్లా అధికారులతో సమీక్షిస్తూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలని ఆదేశించారు.అన్ని శాఖల అధికారులు తమ శాఖల నెలవారీ ప్రగతి నివేదికలను ఆగస్టు 3లోగా జిల్లా ప్రణాళిక అధికారికి సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలైన మహాలక్ష్మి, చేయూత, ఆరోగ్యశ్రీ,ఇందిరా మహిళా శక్తి,ఆసరా పెన్షన్లు,కళ్యాణలక్ష్మి తదితర పథకాల అమలు పురోగతిపై నివేదికలను కూడా ఆగస్టు 3లోపు అందజేయాలని చెప్పారు. సోమవారం నాటి ప్రజావాణిలో మొత్తం 119 దరఖాస్తులు రాగా, రెవెన్యూ శాఖకు 77,ఇతర శాఖలకు 42 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి తో పాటు జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి వినతులు స్వీకరించారు.

## 13వ డివిజన్‌లో డ్రైనేజీ పనులు పరిశీలన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయిస్తామని13వ డివిజన్ కార్పొరేటర్ గుమ్ముల జానకి మోహన్ రెడ్డి పేర్కొన్నారు.నగర మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ విద్యుత్ నగర్‌లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సోమవారం కార్పొరేటర్ గుమ్ముల జానకి మోహన్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఈ పనులను పౌర తగ్గతి న పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్ ఏదుళ్ళ శ్రీధర్ రెడ్డి, నాగార్జున రెడ్డి,విద్యుత్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.



## ఫీజు బకాయిల విడుదల కోసం ధర్నా

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జీవో నంబర్ 9,ఆర్‌ఆర్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నార్కట్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్ వద్ద బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలోధర్నా,రాస్తారోకో నిర్వహించారు.బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్,భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సతీష్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10 వేల కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్,ఎంబీఏ,ఎంసీఏ తదితర కోర్సుల విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని,విద్యార్థుల కోసం హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు పాల్వాయి భాస్కరరావు,పల్లపు దుర్గయ్య,పాలకూరి రమేష్, డెక్కంటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు పేద కుటుంబాలకు వరం



**ప్రజాపక్షం/చండూరు:** ఇందిరమ్మ ఇల్లు పేదవాడికి వరం లాంటిదని చండూరు మాజీ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీలోని ఐదవ వార్డుకు చెందిన భూతరాజు దశరథకు మంజూరైన ఇందిరమ్మ పూర్తి చేసుకొని సోమవారం గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ , అంగడిపేట మాజీ సర్పంచ్ నల్లగంటి మల్లేశం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చేడల వెంకన్న పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక




**ప్రజాపక్షం/మునుగోడు:** ఎఐవైఎఫ్ మునుగోడు మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఆదివారం చలిమడ గ్రామంలో జరిగిన మహాసభలో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శిగా చలిమడ గ్రామానికి చెందిన కట్ట దశరథ్, అధ్యక్షుడిగా చెల్లేడు గ్రామానికి చెందిన పగిళ్ల రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎఐవైఎఫ్‌జిల్లా కార్యదర్శి తీర్పురి వెంకటేశ్వర్లు ప్రకటించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ నెలికంటి సత్యం,జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పురి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆషాఢ బోనాలకు వేములకు ఆహ్వానం

**ప్రజాపక్షం/నకిరేకల్:** నకిరేకల్ పట్టణంలోని శ్రీశ్రీశ్రీ స్వయంభు కాళికామాత ఆషాఢ మాస బోనాల ఆగస్టు2న ఆదివారం రోజున నిర్వహించనున్న ఉత్సవాలకు హాజరు కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశంను ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. పన్నాలగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 13వ వార్డు కౌన్సిలర్ పోతుల సునీత రవీందర్,తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు,మాజీ కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

